కథ



# కృతజ్ఞత

ముందున్న హైస్కూలు వద్దకి వచ్చాడు రత్నాజీ. సున్నం వేసిన హైస్కూలు భవనం తెల్లగా అందంగా ఉంది. రంగు రంగుల కాగితాల జెండాలతో, తోరణాలతో ఆ భవనం, దానిముందు కట్టిన ఎత్తైన స్టేజి కళకళలాడుతున్నాయి. ప్రహరీగోడ చుట్టూ పెట్టిన చిన్న చిన్న జాతీయ జెండాలు అందంగా ఉన్నాయి. ఉపాధ్యాయులతో, తెల్లటి యూనిఫారంలో వున్న విద్యార్థులతో, ఆ ఊరి ప్రముఖులతో, గ్రామస్థులతో హైస్కూలు ఆవరణ అంతా హడావిడిగా ఉంది. ఆ నియోజకవర్గ శాసనసభ్యుడు డా. మోహనరావుకి స్వాగతం పలుకుతూ స్కూలు గేటుకి కట్టబడిన స్వాగతం బోర్డు చూసాడు

## టి.ఎస్.ఆర్. వెంకటేశ్వర్లు

**ఆ**రోజు ఆగస్ట్ పదిహేను. మనదేశానికి స్వాతంత్ర్యము వచ్చిన రోజు. ఉదయం తొమ్మిది గంటలు వేళ నిడుబ్రోలులో రైలు దిగి కారులో తన సొంత ఊరైన 'మారేడుపాడు'కి బయలుదేరాడు రత్నాజీ.

అతను ఆవూరు వచ్చి పదిహేను సంవత్సరాలు అయింది. ఇపుడైనా తను రాకపోను, తన దగ్గర బంధువు బాపినీడుకు హార్టు ఎటాక్ వచ్చిందని తెలిసి చూడ్డానికి తప్పక వస్తున్నాడు. ఆ వూరుకి

రత్నాజీ. చిన్నప్పుడు తాను చదువుకున్న హైస్కూల్లో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను చూడాలనిపించింది అతనికి. బయటున్న కారుల వరుసలో తనకారు కూడా పార్కు చేసి స్కూల్లోపలికి వచ్చాడు. అంతకుముందే జెండా వందనం అయినందువల్ల దానిచుట్టూ పడిన పువ్వులతో అందంగా వుంది ఆ ప్రాంతమంతా. జాతీయజెండా స్వేచ్ఛగా గాలికి రెపరెపలాడుతూ ఆకాశంలోకి ఎగురుతోంది.

స్టేజి ముందు కుర్చీల్లో జనం కూర్చుని ఉన్నారు. తను కూడా చివరి వరసలో ఒక కుర్చీలో కూర్చున్నాడు. రత్నాజీని అక్కడ చూసినవాళ్ళు ఎవరూ గుర్తు పట్టలేదు.

హైస్కూలు హెడ్మాస్టరు స్టేజిమీదకు వచ్చి "అందరికీ స్వాగతం! నా వందనాలు. ఇపుడు మన శాసన సభ్యులు డా. మోహనరావుగారు తమ సందేశం వినిపిస్తారు" అని ప్రకటించారు. మోహన రావు లేచి, అందరూ గాంధీజీ, నెహ్రూలాంటి స్వాతంత్ర్య సమరయోధుల అడుగు జాడల్లో నడవాలని చెప్పుతూ, కాస్సేపుతమ ప్రభుత్వం చేపట్టిన ప్రజా కార్యక్రమాలను గురించి చెప్పి, "ఇపుడు 'వెంకటరాయుడు మెమోరియల్ ట్రస్ట్' స్థాపకులు జయరాంగారి చేత మెరిట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు, స్కాలర్ షిప్పులు ప్రదానం జరుగు తుందని" చెప్పారు. అది విన్న రత్నాజీ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు ఆశ్చర్యపోయాడు. వెంకటరాయుడు అంటే తన తండ్రి. ఆయన జ్ఞాపకార్థం ట్రస్ట్ పెట్ట డమా ? తన ఈ స్వంత ఊరులో తన తండ్రి పేర బహుమతులు, స్కాలర్‌షిప్పులు ఇవ్వడమా ? ఇది కలా......? నిజమా ? అనుకున్నాడు. తన తండ్రిని ఇంతగా గౌరవించిన ఆ జయరాం ఎవరో ?....... అని చూడ్డానికి ఆత్రుతత, కంగారు కలిగాయి రత్నాజీలో.

మొదటి వరుసలోని కుర్చీలోంచి లేచి అరవై ఐదేళ్ళ ముసలాయన స్టేజీమీదకు వచ్చి మైకు దగ్గర నిలబడి, "అందరికీ దండాలు ! నాపేరు జయరాం. నేను చెన్నైలో ఉంటున్నాను. ఈరోజు అంత దూరం నుంచి నేను ఈ మారేడుపాడు గ్రామానికి రావడానికి కారణం మీ గ్రామస్తుడు స్వర్గీయ వెంకటరాయుడు గారి మీద నాకున్న అభిమానం, గౌరవమే. ఆయన ఎంతో కష్టపడి, ఓర్పుతో, ఉత్సాహంతో నాలుగు ఫ్యాక్టరీలు పెట్టి, వాటిని సుమారు ఇరవై సంవత్స రాలు నిరాటంకంగా నడిపారు. ఆ కాలంలో వంద లాది కార్మికులకు, ఉద్యోగులకు ఉపాధి కలిగించారు. ఆయనవల్ల సమాజానికి ఎంతో మేలు కలిగింది. మనందరం గుర్తుంచుకోవలసిన వ్యక్తి ఆయన" అంటూ బహుమతి ప్రదానం ప్రారంభించారు. జయరాం మాటలు విన్నాక సభలో కలకలం మొదలయింది. కొందరు చెవుల్లో గుసగుస లాడేరు. రత్నాజీకి మాత్రం కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి. జయరాంని పరీక్షగా చూసేక గుర్తు పట్టేడు. గతం గుర్తుకొచ్చింది.

✿ ✿ ✿

రత్నాజీకి అపుడు పద్దెనిమిదేళ్ళ వయస్సు. బి.కాం. చదువుతున్నాడు. ఎరువులు వ్యాపారంలో బాగా సంపాదించిన రత్నాజీ తండ్రి వెంకట్రాయుడి గార్కి ఏదైనా ఫ్యాక్టరీ పెట్టాలనే ఆలోచన వచ్చి తన మేనేజింగు డైరెక్టరుగా, తన నలుగురు తమ్ముళ్ళను డైరెక్టరులుగా ఉంచి కంపెనీ ప్రారంభించి,మందుల ఫ్యాక్టరీ పెట్టాడు. వెంకటరాయుడు గారు తన స్నేహితుడైన సోమనాథం గారి అల్లుడు, ఎమ్.ఎస్.సి. చదివిన జయరాంకు ఆ ఫ్యాక్టరీలో ఉద్యోగమిచ్చారు. జయరాం ఆ కంపెనీలో మొదటి ఉద్యోగి అయ్యాడు. చదువు పూర్తి అయ్యాక రత్నాజీ కూడా తన తండ్రి కంపెనీలో డైరెక్టరు అయ్యాడు. క్రమేపి కంపెనీ లాభాలబాటలో నడిచింది. పది సంవత్సరాలలో ఇంకో మూడు ఫ్యాక్టరీలు పెట్టేడు వెంకట్రాయుడు గారు. తన ఊళ్ళోను, చుట్టుప్రక్కల ఊళ్ళల్లోను వెంకటరాయుడి గారి పలుకుబడి పెరిగింది. ఆయనంటే నమ్మకం కలిగింది అందరికీ.

జయరాం సమర్థతతో కష్టపడి పనిచేసే వాడు. నమ్మకమైన ఉద్యోగిగా ఉండేవాడు. అందరితో మంచిగా ఉండేవాడు. జయరాం ఇరవైఏళ్ళు కంపెనీలో పనిచేసాక ఆ అనుభవంతో తనే స్వయంగా ఒక ఫ్యాక్టరీ పెట్టి నడుపుకోవాలనే ఆలోచన వచ్చి నిర్ణయం తీసుకున్నాడు. వెంకట రాయుడు గార్కి రాజీనామా లెటరిచ్చి రిలీవయ్యాడు. ఆ విషయం తెలిసిన రత్నాజీకి మిగతా డైరెక్టర్లకి ఆశ్చర్యం, అసూయ కలిగాయి. ఇప్పటివరకు తమ దగ్గర పనిచేసిన ఒక ఉద్యోగి ఒక ఫ్యాక్టరీకి యజమాని అవుతాడనే నిజాన్ని సహించలేక పోయారు. అతన్ని ఎలాగైనా ఆపాలనిజయరాంని పిలిచి, ఫ్యాక్టరీ నడపడంలో ఉండే సాధక బాధలు ఉన్నవి లేనివి చెప్పి నిరుత్సాహ పరిచారు. అనుభవం ఉన్న ఒక ఉద్యోగిని వదులుకోలేమన్నారు. ఏవో ఆశలు చూపించారు. అయినా జయరాం వినలేదు. రత్నాజీ కోప్పడి, "జయరాం ! మా నాన్నగారు మిమ్మలిని పిలిచి కంపెనీలో ఉద్యోగమిచ్చి ఇరవై ఏళ్ళు పోషించారు. అందుకు మీరు కృతజ్ఞత లేని ఒక అవకాశ వాదిగా, స్వార్థపరుడన్న ముద్రతో ఈ కంపెనీ విడిచి వెళ్ళుతున్న సంగతి గుర్తుంచుకోండి" అని నిందగా మాట్లాడి పంపించేసాడు. జయరాం కంపెనీ వదిలి వెళ్ళేక అతను మళ్ళీ ఎప్పుడూ కలవలేదు. అతని సంగతులు ఏమీ తెలియలేదు. ఎన్నో ఏళ్ళ తర్వాత జయరాంను ఇప్పుడే చూసాడు రత్నాజీ.

గతం నుంచి బయటపడ్డ రత్నాజీ, కారెక్కి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్న జయరాం వైపు వేగంగా వెళ్ళి, "జయరాంగారూ ! ఒక్కనిముషం" అనగానే అతన్ని కాస్సేపు చూసి గుర్తుపట్టి కౌగిలించు కుని, "మిమ్మలను చూసి చాలా రోజు లయ్యింది ! రత్నాజీ ! మీరు.... ఇక్కడ.... ఈ రోజున.... అని జయరాం అంటుండగా, "రండి. మా బంధువుల ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం" అని రత్నాజీ తన బంధువు బాపినీడు ఇంటికి తీసుకెళ్ళాడు. బాపినీడును పలకరించాక జయరాం, రత్నాజీలు కబుర్లలో పడ్డారు. "రత్నాజీ ! మీ కంపెనీ వదిలి వెళ్ళాక నేను బాగానే ఉన్నాను. నా సొంత ఫ్యాక్టరీ బాగా పనిచేస్తోంది. నా పిల్లలు కూడా బాగా చదువుకుని అందొచ్చారు. మీ నాన్నగారు వెంక ట్రాయుడు గారు నాకు అస్తమాను గుర్తొచ్చేవారు. మీ కంపెనీ విషయాలు మాత్రం నాకు ఏమీ తెలియలేదు. మీ నాన్నగారు పోయినట్లు ఈ మధ్యనే తెలిసింది. ఆయనకు ఏదోఒకటి చేయాలనిపించింది. అందుకే ఆయన పేర ఆయన జ్ఞాపకార్థం ఒక చిన్న ట్రస్టు ప్రారంభించాను. ఆ ట్రస్టు నుంచి ఆయన సొంత ఊరైన ఈ మారేడుపాడు హైస్కూల్లోని విద్యార్థులకు ఈ రోజున బహుమతులు, స్కాలరు షిప్పులు ఇచ్చే కార్యక్రమం హెడ్మాస్టారుతో మాట్లాడి ఏర్పాటుచేసాను ! మీరు ఈ రోజున ఇక్కడ ఉండడం నాకు చాలాసంతోషంగా ఉంది. మీ కంపెనీ సంగ తులు ఎలాఉన్నాయి? చెప్పండి"అడిగాడు జయరాం.

"ఏం చెప్పమంటారూ ? జయరాం ! మీరు వెళ్ళాక ఐదు ఏళ్ళల్లో మా కంపెనీలో అనేక మార్పులు, సంఘటనలు, దారుణాలు జరిగాయి. నాతో సహా మా అందరిలోనూ స్వార్థం మొద లయింది. మాలో మాకు రాజకీయాలు, విభేదాలు ప్రారంభమయ్యాయి. అవినీతి ప్రవేశించింది. కంపెనీ డబ్బుతో ఎవరికి కావలసింది వాళ్ళు సంపాదించు కోవడం, వెనకేసుకోవడం ప్రారంభించాం. ఎవ్వరికీ చిత్తశుద్ధి లేకుండా పోయింది. కంపెనీ ఆర్థిక స్థితి దిగజారింది. ఫ్యాక్టరీలు నష్టాల్లోపడ్డాయి. మాకు కంపెనీలో ఆసక్తి పోయింది. మా నాన్న వెంక ట్రాయుడు గారు పట్టుదలతో తన పలుకుబడిని, నమ్మకాన్ని ఉపయోగించి ఈ ఊళ్ళోను, ఇతర చోట్ల అధిక వడ్డీకి అప్పులు తెచ్చి పెట్టాడు. అయినా నష్టాలు రావడం తగ్గలేదు. మా డైరెక్టర్లం అందరూ ఆయన మాట వినడం మానేసాం. 'నష్టాలకి ఎం.డి.గా నువ్వే బాధ్యుడన్నాం' ఆయన్ని. ఉద్యోగులతో కూడా కుమ్మక్కయి మేమందరం గ్రూపులుగా విడిపోయాం. వెంకట్రాయుడు గారి మేనేజిమెంటు పట్టు తప్పింది. ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. అప్పులిచ్చిన ప్రజలు, బ్యాంకులు అప్పులు తీర్చమని ఒత్తిడి చేసాయి ఆయన్ని. మేమందరం తప్పించుకు తిరిగాం. అప్పులు తీర్చలేక ప్రజల కోపానికి, అవమానానికి గురి అయ్యారు ఆయన. 'నమ్మించి మోసగించాడు మనలిని. తను, కొడుకు, తమ్ముళ్ళు సంపాదించు కుని, వెనకేసుకుని మన అప్పులు ఎగ్గొట్టేడు !.... స్వార్థపరుడు వెంకట్రాయుడు !' అనుకున్నారు

ప్రజలంతా. ఇప్పటికీ అదే అభిప్రాయంలో ఉన్నారు. అందుకే మీటింగులో మీరు మా నాన్నగారి గురించి మంచిగా చెప్పిన మాటలు విన్నాక కలకలం మొదలయి అందరూ చెవులు కొరుక్కోవడం మీరు గమనించే ఉంటారు. ఒకప్పుడు గౌరవంగా బ్రతికిన మా నాన్నగారు మనోవ్యాధితో పోయారు. ఆయన పోయాక నేను ఈ ఊరు రావడం మానేసాను. నేను ఈ ఊరు వచ్చి పదిహేను ఏళ్ళయింది. మా బాబయ్యలు తలో పట్టణంలో నేను వైజాగ్‌లోనూ మేడలు కట్టుకుని వ్యాపారాలు చేసుకుంటూ హాయిగా ఉన్నాం. మా నాన్న గార్ని, మా ఊరిని మేమెప్పుడో మరిచిపోయాం.

కానీ మా నాన్నగార్ని మీరు మరిచిపోలేదు. జయరాం ! ఒకప్పుడు మిమ్మలని కృతజ్ఞత లేని వారని, స్వార్ధపరులని అన్నాను. కానీ ఇప్పుడు మీరే.... ఆయన్ని కృతజ్ఞతా భావంతో గౌరవించారు, మెచ్చుకున్నారు ఇన్నాళ్ళకి మళ్ళీ ఈ గ్రామంలో ఆయన పేరు నిలపెట్టారు !.... అసలైన స్వార్ధపరులం మేమేనండీ ! నైతికంగా మీరు ఎంతో ఎత్తుకి ఎదిగారు. కృతజ్ఞత ఇంత బలమైనదని, అందులో దైవత్వం ఉందని ఇప్పుడే తెలిసింది నాకు. మీరు ఒకప్పటి మా ఉద్యోగి అయినా మీ పాదాలకి నమస్కరించాలని ఉంది" అంటూ వంగుతున్న రత్నాజీని లేపి "మనలో మనకి ఈ నమస్కారాలు, మర్యాదలు అవసరం లేదు రత్నాజీ ! ఇటీజ్ ఆల్ రైట్" అని, వెళ్ళిపోవడానికి కారెక్కి కూర్చున్నాడు జయరాం. రత్నాజీ కారు దగ్గరికి వెళ్ళి వీడ్కోలు చెప్పాడు. జయరాం కారు స్టార్టు చేసాడు.

కొత్తగా వేసిన తార్రోడ్డు మీద వేగంగా కారు వెళ్ళుతోంది. రోడ్డుకి రెండు వైపులా ఏపుగా పెరిగిన చెట్ల గాలితో వాతావరణం హాయిగా ఉంది. జయరాంలో ఆలోచనలు మెదిలాయి. ఆరోజు తను రాజీనామా లెటరు తీసికెళ్ళి వెంకటరాయుడు గార్కి ఇచ్చినప్పుడు ఆయన నన్ను కృతజ్ఞత లేనివాడవని రత్నాజీలా మాట్లాడి వుండే తను కంపెనీ వదిలి వేసే వాడను కాను. కాని ఆయన నన్ను కూర్చోపెట్టి, "జయరాం ! నువ్వు ఇరవై ఏళ్లు ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ ఈ కంపెనీ ఎదుగుదలకి అందరితో పాటు కృషి చేసావు. ఇప్పుడు నువ్వు తీసుకున్న నిర్ణయం నాకు నచ్చింది. స్వయంగా పైకి వచ్చే సత్తా నీలో వుంది. నా సహకారం నీకు ఎప్పుడూ ఉంటుంది" అని ప్రోత్సహించిన ఆయనలో నాకు దేవుడు కనపడ్డాడు'. దారిలో రైలుగేటు పడడంతో కారు ఆపుచేసి ఆలోచనల్నించి బయటపడ్డాడు జయరాం. కొద్ది సేపటికి గేటు తెరుచుకుంది. జయరాం తన ప్రయాణం సాగించాడు.

## చినుకు సమాచారం

అలనాటి సుప్రసిద్ధ కవితా సౌందర్య పిపాసి ఆచంట జానకిరాం (1904 - 1992) గారి సరళ సుందర వచన రచనా తరంగాలు 1963 - 67 ప్రాంతంలో "సాగుతున్న యాత్ర", "నా స్మృతిపథంలో" అనే పేర్లతో మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. ఈ మూడింటినీ ఒకే గ్రంథంగా వెలువరించి ఈ తరం పాఠకులకు అందచేయాలని మా ఆకాంక్ష. జానకిరామ్ గారికీ, వారి ఇల్లాలైన శారదాదేవి గారికీ సంతానం లేరు. కనుక కాపీరైట్ కోసం ఎవరిని అడగాలో తెలియక మాకు మేముగా ఈ గ్రంథాన్ని "No Profit, No Loss" పద్ధతిన ప్రచురించదలచుకున్నాం.

ఈ గ్రంథం 1/8 డెమీలో సుమారు 600 పేజీలు వస్తుంది. 1000 కాపీలకు అంచనా వ్యయం రు. 90,000. మా ద్వారా విక్రయించే ధర పోస్టేజీతో సహా రూ. 130/-కి ఒక కాపీ అనుకుంటున్నాం. అడ్వాన్సు బుకింగు స్వీకరించే ఆలోచన ఉంది. అంతేకాక, జానకిరామ్‌గారి అభిమానులు విరాళాలిచ్చి ఎక్కువ సంఖ్యలో కాపీలు పొందవచ్చును.

పై విషయాలను గమనించేవారు సంప్రదించవలసిన చిరునామా : భరాగో, కరెస్పాండెంట్, జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్, అర్జున అపార్ట్‌మెంట్స్, కృష్ణా కాలేజి వద్ద, విశాఖపట్నం - 530 022. ఫోన్ : 0891 - 2535550.

### తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క ఊహాచిత్రం విడుదల



తెలుగులో మొదటి కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క అని కడప జిల్లా రచయితల సంఘం, నందలూరు కథానిలయం అధ్యక్షులు ఎ.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కడపజిల్లా రాజంపేట మండలం తాళ్ళపాక అన్నమాచార్యుని సతీమణి తిమ్మక్క అన్నారు. తెలుగు తొలి కవయిత్రి తిమ్మక్క ఊహా చిత్రాన్ని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన ప్రముఖ చిత్రకారుడు సింగంశెట్టి సత్యనారాయణతో గీయించినట్లు రాజేంద్రప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలకు ప్రాధాన్యత, ప్రోత్సాహం లేని రోజుల్లోనే కవిత్వం రాయడం విశేషం అన్నారు. దేశ కవితకు పట్టం కట్టడంలో అన్నమయ్యకి వారసురాలని అన్నారు. ద్విపదలో "సుభద్రాకళ్యాణం" రాసి దేశ్యపదాలకు, రాయలసీమ మాండలిక పదాలకు స్థానం కల్పించిన దేశి కవయిత్రి అని అన్నారు. మొట్టమొదటగా మంజరీద్విపదలో రాసిన కవయిత్రి అన్నారు. మొట్టమొదటిగా కవిత్వం రాసినా జంకకుండా "పురుషుల నెప్పుడు నమ్మగరాదు పడతి" అని సుభద్రకు సుద్దులు చెప్పిన లోక పరిశీలన గల కవయిత్రి. భార్య భర్తలిద్దరూ కవులుగా ఉండే అరుదైన సంగతికి అన్నమయ్య, తిమ్మక్కలే మొదటి జంటగా చెప్పవచ్చునని అన్నారు. ఈమెకు తిమ్మమాంబ, తిరుమలాంబ అని పేర్లు కూడా ఉన్నాయని అన్నారు. శరీరం పులకరించేటట్లు సులభ శైలిలో మృదు మధురమైన భాషలో "సుభద్రా కళ్యాణం" ద్విపద కావ్యం రచన జరిగిందని అన్నారు.

తాళ్ళపాక తిమ్మక్క పేరుతో కవయిత్రులకు పురస్కారాలు : త్వరలో ప్రముఖ కవయిత్రులను ఎంపిక చేసి తాళ్ళపాక తిమ్మక్క కవితా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.